# ముళ్ళు

రాం భద్రపురం జంక్షన్ పెళ్ళి మరునాటి సత్రంలా ఉంది. విశాఖపట్నం నుండి పార్వతీపురం మీదుగా రాయఘడ వెళ్ళేబస్సు అది. సాలూరు మీదుగా జయపూర్ బలిమెలా వెళ్ళే ఒరిస్సా బస్సులకు రాంభద్రపురం ఓ జంక్షన్ గత రెండు రోజులుగా తుఫాన్ కారణంగా బస్సులేవీ తిరగలేదు. ఈ రోజే కాస్త తెరిపిచ్చిందేమో ఒక్కొక్కటి బస్సులొచ్చి ఆగుతున్నాయి.

బస్సు ఆగీ ఆగ్గానే పువ్వుల పిల్లలూ, పళ్ళమ్ముకునే అబ్బాయిలూ జంగిళ్ళతో కూరలమ్ము కునే వాళ్ళు బస్సుల చుట్టూ ఈగల్లా మూగుతున్నారు. సాయంకాలం నాలుగయిపోయిందేమో కూరలూ పళ్ళూ అలాగే మిగిలిపోతున్నాయని బాధపడుతున్న వారికి బస్సులరాక కొండంత ఆశ కలిగించింది.

"బాబూ... పళ్ళండీ! ఆపిల్ పళ్ళు అమృర్తంలాగుంటాయి. కొనండిబాబూ.. కొనండి. ఒక్కటి కొన్నారో మళ్ళీపళ్ళకోసం రాంభద్రపురం రావాలి. చౌకండీ బాబూ.. బలే చౌక .. ఆలస్యం చెయ్యకండి.. ఆలోచించకండి..! "ఆగిన రాయఘడ బస్సు దగ్గరకొచ్చి అరుస్తున్నాడు గున్నుబాబు.

సాయంకాలం ఆరున్నర, ఏడు అయింది. ఏభయిరూపాయిల బేరం అయ్యింది. పెళ్ళిపోదాం అనుకున్నాడు, కానీ తోడి పిల్లలు మరో గంట చూద్దాం అన్నారు. 'పద టీ తాగుదాం' అని పిల్లలందరూ టీ కొట్టుమీద పడ్డారు. గున్నుమాత్రం దూరంగా కూర్చున్నాడు. పళ్ళ జంగిడి ప్రక్కన పెట్టి.

" ఏట్రా? టీ అన్నా తాగవా? నా నిప్పిస్తాన్లే రా! అని గున్ను స్నేహితుడు గున్నుకు టీ ఇప్పించాడు. గున్ను టీ తాగుతుండగా బస్సు వచ్చి ఆగింది. పిల్లలందరూ టీ రెండు గుక్కల్లో పూర్తి చేసి బస్సు మీద పడ్డారు.

పావుగంట ఆగటం వల్ల గున్నుకు పాతిక రూపాయల బేరం అయింది. అయినా వాడిలో హుషారులేదు " ఏట్రా? అంతలేసి బేరాలు కొట్టేస్తున్నావు, ముగంలో సంతోషంనేదు... సంబరం నేదు" అన్నారు పిల్లలంతా.

నిజమే గున్ను ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉంటాడు. మంచి మంచి కబుర్లు చెప్తుంటాడు.

"అది కాదురా! ఇంటికెల్లీ సరికి పడ్డాటి పోతుంది. బోల్డు హోం వర్కుండి పోయింది. చెయ్యపోతే మాష్టారు ఎండలో నిలబెట్టేస్తారు. పోనీ పన్లోకి రావటం మానెద్దామంటే ఇంటికాడ అయ్యొప్పుకోడు. ఓ రోజు రాపోతే ఈ సరుకుండిపోద్ది' అన్నాడు దిగాలుగా

పిల్లలందరికీ గున్నంటే ఎంతో ఇష్టం రోజా వాడు స్కూల్లో జరిగే విషయాలు... మంచి మంచి కథలూ చెప్తుంటాడు. తెల్లారి నాలుగు గంటలకి వేస్తాడు. ఇంట్లో పని పూర్తి చేసుకుని సెంటర్ కోచ్చేస్తాడు. ఎనిమిదిన్నర వరకూ తాజా కూరలు అమ్మి పది రూపాయలు గడిస్తాడు.

ఇంటి కెళ్ళిస్నానం. చేసి, భోం చేసి పుస్తకాలు తీసుకుని స్కూలు కెళ్తాడు. అయిదుదాటాక సెంటరు కొచ్చి ఎనిమిది వరకూ వ్యాపారం చేస్తాడు. మళ్ళీ పదిన్నర వరకూ చదువు వాడిని చూసి పిల్లలందరూ ముచ్చటపడతారు.

స్కూల్లో..లెక్కల మాస్టారికి గున్నంటే గొప్ప కోపం వాళ్ళక్కడా ట్యూషను చదవడు అయినా ఫస్టు మార్కులు తెచ్చుకుంటాడు. అదే క్లాసులో ఉన్న లెక్కల మాస్టారబ్బాయికి సెకండో, థర్డో తప్ప ఎంతమొత్తుకున్నా ఫస్టురావటంలేదు. అందుకే వర్కులో ఏ మాత్రం వెనుక బడినా. తోలు తీసేస్తాడాయన, అయితే పిల్లల్లోనూ, మిగతా ఉపాధ్యాయులలోనూ, గున్ను బాబు మీద సానుభూతీ, లెక్కల మాస్టారు మీద కోపం ఉన్నాయి. కానీ! వాళ్ళేంచేయగలరు?

స్కూల్లో పరిస్థితి ఇలా ఉంటే -

ఇంటి దగ్గర ఇంకో విధమైన నరకం!

తండ్రి పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుంటాడు. ముప్ఫయ్యో నలభయో సంపాదిస్తాడు. సాయంకాలానికి కడుపు నిండా సారా పట్టిస్తాడు. జేబులు ఖాళీ చేసుకుంటాడు. ఇంటి కొచ్చి చేపల పులుసు, కోడి కూర పెట్ట మంటాడు. తల్లి ఎవరింటనో అంట్లు తోమి సంపాయించే డబ్బులు గంజి మెతుకులకే చాలవు. గున్ను తెచ్చిన డబ్బులు ఇంటద్దెకూ, పై ఖర్చులకూ సరిపోతాయి. కార్డు మీద బియ్యమో, కిరసనాయిలో తెచ్చుకునేవారు. ఆ కార్డుని తండ్రి ఏ షావుకారు దగ్గర పద్దుపెట్టీ సాడో, అమ్మేసాడో తెలీదు. అడిగితే బదులు చెప్తే అక్కడేది దొరికితే దాంతో చావబాత్తాడు. ఇంటినిండా ఏడుపులూ, గోల ప్రక్కవాళ్ళ సాను భూతులూ, తండ్రి బూతులూ!

రోజూజరిగే బాగోతమే నిన్నటి రోజు జరిగింది తండ్రి గున్నును చదువు మానేయమంటాడు,. తల్లి వీల్లేదంటుంది. అలాగన్నదని బొరిగ తిరగేసి కొడతాడు కొంచంలో తప్పింది. లేకపోతే తల్లి కన్ను పోయుండేది!

జరిగిందంతా చెప్పాడు. అందరింటా అదే తతంగం. కాకపోతే తక్కిన పిల్లలంతా ఫుల్ టైంగా అమ్మకాలు చేసుకుంటారు చదువుల్లేక.

రాత్రి ఎనిమిదయ్యింది.

పార్వతీపురం వెళ్ళే ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది.

అయిదు నిమిషాలే ఆగింది. పిల్లలు బిలబిలామూగారు దిగి సోమ్ముని కండక్టరు తిట్లు తిట్టాడు. అప్పటికే గున్ను ఎవరో పిలిస్తే బేక్ సీటు దగ్గరకెళ్ళి పళ్ళు ఇచ్చాడు డబ్బులు తీసుకోబోతుండగా బస్సు కదిలి పోయింది.

"ఆ పండాపండి దిగి పోతాను బాబూ! డబ్బులిచ్చేయండి" అని కంగారు పడిపోయాడు గున్ను అతను ఏభైనోటిచ్చాడు చిల్లర గబగబా ఇచ్చేసి బాబ్బాబు ఆపేయండి దిగిపోతాను. అని బతిమాలాడు.

"నా కొడకల్లారా! బస్సాగనివ్వరు కదరా! మీకిలాక్కాదు రైట్రైట్" అన్నాడు కండక్టరు.

డ్రైవరు జోరు పెంచాడు. గున్ను కండక్టరిని బ్రతిమిలాడుతున్నాడు. కండక్టరు వినిపించుకోలేదు. ఎస్పారుచూసుకుంటున్నాడు. గున్ను డ్రైవరు దగ్గరకెళ్ళాడు. డ్రైవరు కండక్టర్ని అడగ మన్నట్టుగా చూపాడు. జనానికి వినోదంగా మారింది.

గున్ను కండక్టరు కాళ్ళుపట్టుకున్నాడు. కన్నీళ్ళు పెట్టుకున్నాడు. కొందరు జాలిపడ్డారు. కొందరు గున్నునేతిడుతున్నాడు. " ఏరా! ముందు చెప్పినపుడు దిగిపోవచ్చుగా!" అన్నాడొకాయన.

"ఆడెందుకు దిగుతాడండి. ఈ నాకొడుకులకిలా అలవాటయిపోయింది."

"నిజమే! కండక్టర్‌కి వంతపలికారు కొందరు."

"ఏరా! శుభ్రంగా చదూకొచ్చుకదా!" అన్నాడొకాయన.

"చదూకుంటున్నానండీ!"

"ఏం చదువుతున్నావ్? " ఆయనే మళ్ళీ.

" ఏడోతరగతి" గున్ను జవాబు"

"అబద్దాలకేం వెనుకాడ్డు. వీడి మొహానికి చదువుకూడా. ఏదీనీకొచ్చిన తెలుగు పద్యం చెప్పుఏడో తరగతిలోది?" ఆయన తెలుగు మాష్టారేమో, అడిగాడు. దుఃఖాన్ని దిగమింగి పద్యాన్ని చెప్పాడు ఇంకో మాష్టారు ఇంకేవో ప్రశ్నలు వేసాడు.వాడన్నిటికీ జవాబులు చెప్పాడు.

"మరి ఎప్పుడు చదువుతున్నావు?"

వాడి దిన చర్య చెప్పాడు అప్పటికి బస్సు చాలా దూరం పోయింది " ప్రభుత్వాలు బాల కార్మిక నిషేధం అంటుంది. ఏం చేస్తోంది?" ఒకరంటే -

"బాల కార్మికుల్నే నిషేధస్తోంది" వ్యంగ్యంగా ఇంకో ఆయన. అంతేగాని బస్సాపమని ఎవరూ అనక పోవటం గమనించిన ఓ పెద్దాయన, అప్పటికే వాడి పరిస్థితికి మనసు తడిసి "ఆపేయండి! వాణ్ణిందుకేడి పిస్తారు?" అన్నారు.,

ఇప్పుడు బస్సునిండా వాడి మిర సానుభూతి నిండిందేమో అందరూ ఆపమన్నారు. కండక్టరు తిట్టుకుంటూ బస్సాపి ఆపగానే "దిగు" అని ముందుకు తోసి రైట్ చెప్పాడు.

వాడు తూలిపడ్డాడు. వాడి జంగిట్లోంచి వళ్ళు చిల్లరా నేల నిండా తుళ్ళాయి. ఆకాశం నిండా మబ్బులు.. మళ్ళాకురవటానికి సిద్ధంగా చిన్నజల్లు చిమ్మచీకటి.. చింతగీర్ల రొద, కళ్ళ నిండానీళ్ళు క్రిందకు నెట్టి వెయ్యబడ్డాడేమో, మోచేతులు గీరుకుపోయాయి. కాగితం మడతల్లో నోట్లు భద్రంగానే ఉన్నాయి, పళ్ళు ఏరుకున్నాడు.

జిగేలును మెరుపు మెరుపు వెలుగులో కనిపించిన మేర చిల్లర ఏరుకున్నాడు బావురుమన్నాడు. సెంటరుకెంతదూరంలో ఉన్నాడో తెలీటం లేదు. ఓపికతో ముందుకునడిచాడు,.

ఎవరిదో పరుగులాంటి నడక..

ఆవెనుకే సైకిలుతో మరొకడు. ఏటింకా ఇక్కడే ఉన్నావా సైకిలెక్కి అన్నాడు సైకిలు ఎక్కబోతున్న అవతలి వ్యక్తికి గున్నుకంటబడ్డాడు.

"ఇదుగో అబ్బాయి, నువ్వెక్కడికెళ్ళాలి?" అన్నాడు.,

చెప్పాడుగున్ను "సరేమేం నిన్నుతీసుకెళ్తాం గానీ ఈ సంచీనీదగ్గరుంచు ఇక్కడే కూర్చో . అయిదు నిఎముషాల్లో వస్తాం" అని ఆమూటలాంటి సంచీ గున్ను చేతిలో పెట్టి ఆ ప్రక్క జనపచేల్లోకి పరుగెత్తారు సైకిలుతో మరో అయిదు. నిమిషాలకు ఇద్దరు కానిస్టేబుళ్ళు వచ్చారు. చెట్టు మొదట్లో కూర్చున్న గున్నుమీద లైట్ పోకస్ చేసి" ఏయ్! ఇక్కడేటి సేస్తున్నావురా?" అన్నారు.

వాడుజవాబు చెప్పలేదు భయంతో

"అదేట్రా ఆసంచీ?"

"పళ్ళు" దాంట్లో ఏమున్నాయో నిజానికి వాడికి తెలీదు. వాళ్ళుసంచీని తనిఖీచేసారు. సంచినిండా సారా పేకెట్లు కనిపించాయి.

"ఏట్రా? ఇవి పళ్ళా?" అని లాఠీతో ముణుకులు మీద కొట్టారు. వాడు జరిగిందంతా చెప్పాడు అయినా వాళ్ళు వినలేదు. వాడిదగ్గరున్న పేకెట్లు తీసుకుని గడగడాత్రాగారు. త్రాగటం మొదలెట్టాక చాలాసేపటి వరకూ ఆపటం మరచిపోయారు. అరగంటపోయాక "ఒరేయ్ గుంటడా! ఆలెటెల్లేర్రా?" అన్నారు.

"ఇదుగో! ఈ చేల్లోంచేపోయారు" అని చేనువేపు చూపెట్టాడు. " ఇదిగో నువ్విక్కడే ఈట్ని చూస్తుండు కదిలావో.. నీ పనైపోద్ది " అని టార్చిలైటు వేసుకుని చేలోనికెళ్ళారు.

గున్ను చెమటతో తడిసి ముద్దయిపోయాడు.,

'ఇవాళెవరి ముఖం చూసానో అంతా దరిద్రమే' అనుకుని పారిపోవాలను కున్నాడు. కాళ్ళలో సత్తువలేదు. వాళ్ళు మళ్ళీ వచ్చి సైకిలు మీద వెతుక్కుంటూ వస్తే ? అమ్మో భయం వేసింది చూట్టు చూసాడు. చింత చెట్టు కనిపించింది. జడలు విరబోసుకున్న దయ్యంలా ఉంది ఆపద భయంకన్నా గొప్పది కావడం వల్లా .. ధైర్యం తెచ్చుకుని .. జంగిడితోచెట్టెక్కాడు చెట్టుకొమ్మమీద కోతిలా కూర్చున్నాడు. చెట్టు మీద గుడ్లగూబ అరుస్తోంది. గుండెదడదడ మంటోంది. ఎప్పుడో పాడుకున్న పాటగుర్తొచ్చింది. "చింత చెట్టు మీద దెయ్యము నాకేటి బయ్యము."

ఇప్పుడు దయ్యమే వచ్చినా తనేం చెయ్యగలడు?

అనుకున్నంతలో కింద ఒంటికన్ను రాక్షసిలా కానిస్టేబుళ్ళ టార్చిలైట్ల వెలుగు! గువ్వలా ఒదిగిపోయాడు! కొమ్మ నంటుకుని కళ్ళు మూసుకున్నాడు.

"గుంట నా కొడుకు టోకరా ఇచ్చాడు." అని అక్కడే ఉన్న సంచీ చూసి సంబరపడి, దాన్ని పట్టుకుని వెళ్ళిపోయారు.

అమ్మయ్య అనుకున్నాడు.

పదిగంటలకెలాగో ఇల్లు చేరుకున్నాడు. ఇంటి కొచ్చే సరికి తండ్రి తల్లిని దుడ్డుకర్రతో



కథా నిలయం
3967

బాత్తున్నాడు. అక్క తల్లికి, తండ్రికి అడ్డంగా నిలబడి - తండ్రికాళ్ళు పట్టుకుని," అయ్యా! అమ్మని సంపీకురా! అని మొర్రో మంటోంది.

గున్నుకు కోపం చివ్వున పొడుచుకొచ్చింది.

క్షణం స్తబ్దంగా ఉండిపోయాడు.

తండ్రిని చంపెయ్యాలనుకున్నాడు. ఆమధ్య ఎక్కడో చదివాడు. హంతుకులైన చిన్నపిల్లల్ని జైల్లో పెట్టి చదివిస్తారని. అది గుర్తుకు రాగానే తండ్రిని మరిప్రాణాలతో మిగల్చకూడదనుకున్నాడు. తల్లి దేవతలా కనిపించింది. దానికి వికృతిలాకనిపించాడు తండ్రి.

ప్రహ్లాదుడు హిరణ్యాకశిపుణ్ణి చంపలేదా?

శత్రువు! తండ్రి ముమ్మాటికీ శత్రువే తమ ఇంట్లో ఆనందాన్ని హరించే నరరూపరాక్షసుడు! కిరాతకుడు.

చంపేయాలి!

ఈ రాత్రికే!

ఇంటి నుండి వెళ్ళిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగి పన్నెండు గంటల కిల్లు చేరుకున్నాడు. జరగబోయే కార్యక్రమం కళ్ళముందు కనిపిస్తోంది. తాగి పడి ఉన్న తండ్రి గొంతుమీద చురకత్తి ఒకటి కాదు.. రెండు.. మూడు పోట్లు! రక్తం మడుగులో తండ్రి.

పీకకోసిన కోడి పుంజులా కొట్టు కుంటాడు. తల్లి గొల్లుమంటుంది. పోలీసులొస్తారు. వాళ్ళెందుకురావటం? తనే వెళ్ళి వాళ్ళ కు చెప్పి లొంగిపోతాడు.

రేపటి పేపర్లో తండ్రిని చంపిన తనయుడు వార్తవస్తుంది. కొందరు తాగుబోతు తండ్రిలైనా కళ్ళు తెరుస్తారు.

ఆలోచనల్లోనే ఇల్లు చేరుకున్నాడు. గుడ్డి దీపపు వెలుగులో తండ్రి మంచం దగ్గర కెళ్ళాడు. తండ్రి అక్కడలేడు లోపలగదిలో రెండు ఆకారాలు.. ఆ మంచం మీద తల్లి. తండ్రి గుసగుసలు.

అసహ్యంగా .. జుగుప్సగా..

ఛీ..ఛీ.. చండాలం వీళ్ళు మనుషులేనా?

గున్నుకు అక్కడ ఉండాలనిపించలేదు తల్లి మీద కోపం వచ్చేసింది. అమ్మ అసలు మనిషేనా? అనుకుంటూ వీధిలోకి నడిచాడు. వాడి చిన్న బుర్ర నిండా ప్రన్నలే!

ముళ్ళే.........!

(5-12-1998 ఆంధ్రభూమి దిన పత్రికలో ప్రచురితము).

* * * *